

# 'అదే' కథలు

## - ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

### 83

### తన సామ్రాజ్యం

**ఆరునెలల్లో కొడుకు పుడతా**డని తెల్సిన నారాయణ, వాళ్ళవిడా ప్లాన్ వేసుకోవడం మొదలుపెట్టారు. మొదటిది అత్తామామలని పిలవాలా, తల్లితండ్రులని పిలవాలా సహాయానికి? ఈ వాదోపవాదనలు ఏనాడూ తెమలవు కదా? ఈ లోపున డెలివరీ సమయం మూడు నెలల్లోకి వచ్చింది.

అత్తగారు వస్తే తనని 'ఇలా ఉండాలి, అలా ఉండాలి, ఇది తినాలి, ఇది కూడదు, ఇల్లు సరిగ్గా లేదు..' అంటూ చంపుతుంది, తనకి ఎలా ఉన్నా. అందువల్ల తల్లి తండ్రులే బెటర్.

అయినా 'కూతురికి తల్లి దగ్గిర ఉంటే మంచిదా, అత్త ఉంటే మంచిదా? మీ అమ్మగారు నన్ను ఉత్తినే సాధించడం మీకు తెలియదా?'

ఈ వాదలనల్తో బుర్ర వేడెక్కాక నారాయణ అత్తా మామలనే రప్పించడానికి కాయితాలు పంపి విమానం టికెట్లు కొన్నాడు. తర్వాత ఈ విషయాలు తానొక్కడూ తల్లితో మాట్లడుతున్నప్పుడు ఫోన్ మీద చెప్తే 'అవునులేరా కని పెంచి చదువు చెప్పించిన మాకంటే నీకు వాళ్ళే ఎక్కువ' అని దెప్పి పొడిచింది. నీకు నేను పుట్టినప్పుడు మామ్మ ఏమైనా సహాయం చేసిందా లేకపోతే నీలాగే దెప్పి పొడిచిందా అని అడిగేడు నారాయణ ఆవిణ్ణి. 'అవన్నీ ఇప్పుడెందుకులే' అని దాటేసింది

ఆవిడ. అవి వేరే విషయం. ఇంకో వేరే విషయం ఏమంటే ఆవిడ చాన్నాళ్ళనుంచి అమెరికా రావడానికి ప్లాన్ చేసుకుంటే ఈ అత్తా మామల వల్ల ఇదంతా పాడైంది. అదీ ఆవిడ గోల.

కొడుకు పుట్టాక నారాయణ అత్తగారు కింద కూచోకుండా సేవ చేసింది ఆరు నెలలు. ఈ ఆరు నెలల్లో మామగారు నారాయణని ఇదేమిటి, అదేమిటి, అమెరికాలో ఇది ఎలా అది ఎలా, మా అబ్బాయికి ఉద్యోగం ఇప్పించూ అంటూ చంపాడు. నారాయణ తనకి తెల్సిన సహాయం చేస్తానని ప్రామిస్ చేసాడు కూడా. అయితే ఇండియాలో ఓ బిజినెస్ మేనేజర్ గా పనిచేసిన ఈ మామగారికి తానో హీరోనని గట్టి నమ్మకం. ఊర్లో ఉన్న యూనివర్సిటీ ఆఫీసులకి ఫోన్ చేసి ఫలానా ప్రొఫెసర్ ని కలవడం కుదుర్తుందా, నేను ఇలా స్టాక్ విషయాలు మాట్లాడాలి అని అడుగుతూ ఉంటే వాళ్ళు వెనక్కి ఫోన్ చేసి అన్సరింగ్ మెషీన్ మీద 'మీరు రావద్దు, మాకు కుదరదు' అని మెసేజ్ లు పెట్టేవరకూ ఈయన చేసిన పనులు నారాయణకి తెలియలేదు. ఆ తర్వాత నారాయణ మామగారి కాళ్ళావేళ్ళా పడి చెప్పాడు ఇలా ఫోన్లు కొట్టకండి మహాప్రభో అంటూ.

మనవడు అటూ ఇటూ పాకడం మొదలు పెట్టేసరికి వాళ్ల వీసా అయిపోయింది. మీ బతుకు మీరు బతకాల్సిందే కదా ఎలాగైనా, ఎప్పటికైనా అని చెప్తూ వాళ్ళు బయల్దేరడానికి సిద్ధమయ్యారు. ఉన్నంతకాలం మామగారు ఎలా తనని ఏడిపించినా అత్తగారు చేసిన సహాయానికి నారాయణ సంతోషించాడని చెప్పాల్సిందే. ఆవిడ లేకపోతే తాను నిజంగా ఆఫీసుకి సరిగ్గా వెళ్ళగలిగేవాడు కాదు. శెలవు అంతా పోయి ఉండేది. వాళ్ళకి ఊరు దగ్గర్లో ఉన్న ప్రదేశాలన్నీ చూపించి వెనక్కి వెళ్ళడానికి ఎయిర్ పోర్ట్ లో దిగబెట్టాక అత్తగారు లేని లోటూ, మామగారు వెళ్ళాక ఆయన గోలా వదిలి హమ్మయ్యా అనుకుంటూ ఉండగానే మామగారు ఇండియా నుంచి కొడుకు – లేదా నారాయణ బావమరిది – గురించి గుర్తు చేశాడు. నారాయణ ఆ కుర్రాడికి తనకి తెల్సిన యూనివర్సిటీలో అప్లికేషన్ పెట్టమని అప్లికేషన్ పంపించాడు. ఆ పై ఏడాదికి బావమరిది అమెరికాలో స్టూడెంట్ వీసా మీద తేలాడు. భార్య కూడా సంతోషించిందనే చెప్పుకోవాలి.

మరో మూడేళ్ళకి భార్య రెండో సారి నీళ్ళోసుకుంది. క్రితం సారి అత్తా మామలు వచ్చినప్పుడు వాళ్ళొచ్చారు, బావమరిదికి తాను సహాయం చేసాడు కనక ఇప్పుడైనా తన తల్లితండ్రులు రావడానికి వప్పుకుంటుందేమో అని నారాయణ అనుకుని రెండో కాన్పుకి అమ్మా నాన్నలని పిలిచాడు. ఈ సారి ఆవిడ అభ్యంతరం చెప్పలేదు. ఆవిడ లోపల ఏమనుకుందో మాత్రం పైకి చెప్పలేదు. అది నారాయణ తల్లీ తండ్రీ వచ్చేదాకా ఆవిడ నోట్లోంచి రాలేదు కూడా. ఎవరి నోట్లోంచి రావాలో ఆవిడ సరిగ్గా ముందే ప్లాన్ చేసుకుంది అని వాళ్ళు వచ్చిన మూడు నెలల వరకూ తెలియలేదు.

రెండోసారి పుట్టినది అమ్మాయి. ఈ సారి ఇంట్లో ఉన్నది కోడలి అత్తగారు – డిఫాల్ట్ గా చెప్పుకోవాలంటే ప్రపంచంలో ఏ అత్తగారికీ కోడలికీ పడదు అనేది జగద్విఖ్యాతమైన నిజం. ఎందుకనేదానికి ప్రతీ కుటుంబానికీ తలో కారణం ఉన్నా అత్తా కోడళ్ళ మధ్య సయోధ్య అనేది ప్రపంచంలో ఏనాడూ కనిపించని [ఎనిమిది వరకూ ఎందుకు గానీ]

మొదటి వింత లేదా అద్భుతం. ఈ అద్భుతానికి శరీరపు రంగూ, కులం, మతం ఏదీ అడ్డంకి కాదు. అందుకే కదండీ మన ఘంటశాల గారు 'అత్తలేనీ కోడలుత్తమురాలూ ఓ యమ్మా, కోడల్లేనీ అత్తా గుణవంతురాలూ' అంటూ సాగదీసి పాడాడు?

అమ్మా నాన్నలు ఇంట్లోకి వచ్చిన మూడో రోజునుంచీ నారాయణ తల పట్టుకుని కూర్చునే సాధింపు మొదలైంది ఇద్దరి ఆడవాళ్ళనుంచీ. మీ ఆవిడ ఇలా చేస్తోంది, ఇలా ఉండకూడదూ అని అమ్మా, ఈవిడేమిటి ఇక్కడ దరిద్రంగా, మా అమ్మ ఎప్పుడైనా ఇలా చేసిందా వచ్చినప్పుడు అని భార్యా పోరుతూంటే ఏమి చేయాలో తెలియని పరిస్థితి.

ఒకసారి అక్కడకీ అనేశాడు నారాయణ పెళ్ళాంతో – 'ఇప్పుడిలా అంటున్నావు కానీ రేపొద్దున్న మన కుర్రాడికి పెళ్ళై కోడలు ఇక్కడకి వస్తే నువ్వు ఆవిడలాగే తయారౌతావు' అని. మరో కొంతకాలం దెబ్బలాటలు. ఇవి గాలివాన అయ్యేలోపు కూతురు పుట్టేసరికి కాస్త సద్దుమణిగినా అసలు బాంబ్ తర్వాత పేలింది. భార్యకి మొదటి నుండీ అత్తామామలు తప్పనిసరిగా ఇక్కడకి వచ్చారు గానీ, ఇక్కడ ఉండడం ఇష్టమే లేదు కనక కాన్పు అయిన నెలకి ఇంకా ఇక్కడే ఉండడం విసుగు అనిపించింది.

మామగారు అప్పటికే నాలుగేళ్ళు ఉన్న మనవడితో మాట్లాడబోయినా వాడితో ఆడుకోబోయినా ఆయనని కసరడం, వాడికి మీరు చెప్పే కబుర్లు అఖ్ఖర్లేదు మీ పని మీరు చూసుకోండి అనడం, టివి చూస్తూంటే ఆ హిందీ సినిమాలు చూడకండి మా అబ్బాయికి నచ్చవు అనడం వగైరా. అత్తగారు వంటింట్లోకి వస్తే విసిరే విసుర్లు వేరు. మీ వంట ఆయనకి నచ్చదు, పిల్లలు తినరు. బయట హాల్లోకి వెళ్ళండి (మా ఇంట్లో ఇంకా ఎందుకున్నారు అని అత్తగారికి వినిపించింది), నేను నెప్పితో ఎలా పోయినా మీకెందుకు (మీరు నాకు చేసినదేమీ లేదు ఇక్కడకి వచ్చి), మిమ్మల్ని బయటకి తీసుకెళ్ళమని చెప్తాను ఆయన్తో (మీరు అమెరికా చూడ్డానికే కదా వచ్చింది నాకు సహాయం చేయడానిక్కాదు) వగైరా. ఈ పెద్దవాళ్ళిద్దరూ తనని ముట్టుకుంటే మనవడు వచ్చీ రాని మాటలతో 'స్టుపిడ్ డోన్ట్ యూ టచ్ మీ' అని అనమని నేర్పించింది ఆవిడ.

ఇలా ఈవిడ చేసే పనులు నారాయణ ఆఫీసులో ఉన్నప్పుడు కనక ఆయనకి తెలియదు. పెద్దవాళ్ళిద్దరూ నోరు మూసుకున్నారు ఇదంతా చెప్తే కొడుకు బుర్ర పాడుచేసుకుంటాడనీ, వీళ్ళిద్దరి మధ్యా కలతలు వస్తాయనీ. అయిన సరే ఓ రోజు ఈ కుర్రాడు తాతని 'స్టుపిడ్ డోన్ట్ యూ టచ్ మీ' అన్నప్పుడు నారాయణ విన్నాడు. లాగి ఒక్కటి కొట్టాక అప్పుడు వాడే చెప్పాడు ఏడుస్తూ – అమ్మ ఇలా అనమని చెప్పింది డాడ్ అంటూ. అవాక్కైన నారాయణ భార్యని అడిగాడు. ఒక్కసారి ఉధృతంగా గొడవ మొదలైంది. మీ అమ్మా నాన్నలని నేను ఎప్పుడైనా ఇలా ట్రీట్ చేసానా అని నారాయణా, వీళ్ళు ఇక్కడకొచ్చి చేసిందేమీ లేదని ఆవిడా పెద్దగా గొడవపడ్డాక అయితే ఇప్పుడు వీసా అవకుండా పంపించేయమంటావా? అని అరిచేడు నారాయణ. ఆవిడ కూడా అరుస్తూ 'అవును పంపించేయండి' అని బెడ్రూం లోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

ఏమనుకున్నారో తెలియదు కానీ ఆ పై వారాంతంలో తల్లీ తండ్రీ చెప్పారు నారాయణకి – వాళ్ళ చుట్టాలలో దగ్గిరవారికి జబ్బు చేసిందిట. వెళ్ళి చూడాలని ఉంది, ఎంత త్వరగా వెళ్తే అంత మంచిది. అలా మరో వారానికి వాళ్ళ టికెట్లు మార్పించి విమానం ఎక్కించాడు. పిల్లలని చూసుకోవాలనే నెపంతో, ఒక కార్లో అందరూ పట్టరూ అనే మరో నెపంతో భార్య పిల్లలూ రారుట ఎయిర్ పోర్ట్ కి. వెళ్ళే దారిలో కారు ఒక చోట ఆపి నారాయణ ఏడుస్తూ చెప్పాడు – తన భార్య ఇలా అన్నందుకు ఏమనుకోకండి, నన్ను క్షమించాలీ అంటూ. కోడలి సామ్రాజ్యంలో తమకి ఉనికి కుదరదని తెల్సాక చుట్టానికి జబ్బు అనే కట్టుకథ తాము కల్పించామని తల్లీ తండ్రీ చెప్పలేదు నారాయణకి. 'ఫర్వాలేదులే ఊరుకో' అని చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు. మరో ఏడాదికి నారాయణ తండ్రికి ఏదో రోగం వచ్చి పోయాడు. కర్మ చేయడానికి ఇండియా వెళ్ళిన నారాయణ తల్లిని తనతో బాటు అమెరికా రమ్మని ఉన్న పదిరోజులూ కాళ్ళావేళ్ళా పడి బతిమాలాక కూడా, ఆవిడ ఖచ్చితంగా తెగేసి చెప్పింది – 'వద్దురా నాకు ఇక్కడ నాన్న ఉన్న ఇంట్లోనే బాగుం(టుం)ది.'

జగద్వితమైన నీతి: తన సామ్రాజ్యం లో అడుగుపెట్టిన అత్తగారిని ఒక కోడలు ఏనాటికీ క్షమించదు

Post your comments